సాక్షి కామారెడ్డి

గురువారం, 12, సెప్టెంబర్, 2024



పరిశుభ్రంగా ఉంచాలి

మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లారా గేట్ వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు.

- 8లో ▸



రుణమాఫీ చేయాలి

అర్హులైన రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని భిక్కనూరు సింగిల్ విండో పాలకవర్గం తీర్మానం చేసింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

17న ప్రజాపాలన దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: నిజాం పాలననుంచి తెలంగాణ ప్రాంతం విముక్తి పొందిన సెప్టెంబర్ 17 ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉదయం 10 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజాపాలన వేడుకలకు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. జిల్లా అంతటా వేడుకలు జరుగనున్నాయి.

'సూచనలు పాటించాలి'



మద్నూర్: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన డోంగ్లీ మండలం మొగాలో పర్యటించారు. సోయాబీన్, కంది, పత్తి, పెసర, మినుము పంటలను పరిశీలించారు. మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికను సందర్శించారు. రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్‌బీఐని సందర్శించి, మేనేజర్‌తో మాట్లాడి రుణమాఫీ, పంట రుణాల రెన్యువల్, కొత్త రుణాల మంజూరు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో రాజు, ఏఈవో విశాల్‌గౌడ్ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో సాయంత్రం ఒక గేటు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

మెస్ మేనేజర్ గెస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సరంపల్లి ఎక్స్ రోడ్ సమీపంలోగల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో మెస్ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. గెస్ట్ పద్ధతిన మెస్ మేనేజర్‌గా పనిచేయడానికి ఆసక్తిగల వారు ఈనెల 12 నుంచి 16 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సు లేదా తత్సమాన కోర్సు) పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు.

'ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానం పాటించాలి'



కామారెడ్డి రూరల్: ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో దళిత వికాస సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బుధవారం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర 40 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఆయా గ్రామాలలో ప్రజలను కలిసి క్రీమీలేయర్ విధానం వల్ల లాభనష్టాలను వివరిస్తున్నామన్నారు. పాదయాత్ర గద్వాల జిల్లా ఆలంపూర్‌లో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత వికాస సమితి ప్రతినిధులు లింగం, బాలరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమజ్జనం

కామారెడ్డి అర్బన్: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన మట్టి గణేశ్ విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేయనున్నారు. ఉదయం 11గంటలకు జీవదాన్ హైస్కూల్ సమీపంలోని బజరంగీ కార్యాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



బదిలీ శాపం..

సాగని పాఠం

- రత్నగిరిపల్లి యూపీఎస్‌లో ఉపాధ్యాయులందరి ట్రాన్స్‌ఫర్
- ఆరుగురు బదిలీ అయితే వచ్చింది ఇద్దరే
- పదోన్నతిపై ఒకరికి స్థానచలనం.. విధుల్లో చేరని రెండో టీచర్
- పాఠాలు చెప్పేవారు లేక నష్టపోతున్న విద్యార్థులు

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ఆ పాఠశాలకు శాపంగా మారాయి. ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులు బదిలీ కాగా.. వారి స్థానంలో ఇద్దరు మాత్రమే వచ్చారు. అందులో ఒకరు పదోన్నతిపై వెళ్లిపోగా.. మరొకరు ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. టీచర్లు లేకపోవడంతో కొందరు విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లిపోతున్నారు. దీంతో మిగిలినవారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.



మాచారెడ్డి : రత్నగిరిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం ఆరంభంలో 104 మంది విద్యార్థులున్నారు. ఏడు తరగతులకు పాఠాలు బోధించేందుకు ఆరుగురు టీచర్లుండేవారు. ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఈ బడికి శాపంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న ఆరుగురు టీచర్లూ బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇద్దరు మాత్రమే వచ్చారు. మిగిలిన నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వచ్చిన ఇద్దరిలో ఒకరు పదోన్నతిపై వెళ్లిపోయారు. మరో టీచర్ ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. దీంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. టీచర్లు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే పాఠశాలలో చేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ బడిలో 69 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. ఉన్న విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడంతో గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరిగారు. టీచర్లను నియమించాలని మొరపెట్టుకోవడంతో ఇద్దరు టీచర్లను సర్దుబాటు చేశారు. గ్రామస్తులు ఒక విద్యావలంటీర్‌ను నియమించారు.

గ్రామస్తులు తీర్చిదిద్దిన బడి..

రత్నగిరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గ్రామస్తులు తీర్చిదిద్దారు. ప్రభుత్వ నిధులతో పాటు తలా కొంత జమ చేసుకుని బడిని ఆకర్షణీయంగా మార్చారు. తరగదులకు త్రీడీ పెయింటింగ్‌తో పాటు ఆకర్షణీయమైన బొమ్మలను వేయించి కార్పొరేట్ బడిలా తయారు చేశారు. గ్రామానికి చెందిన పిల్లలు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా కట్టడి చేసి ఊళ్లోనే చదువుకునేలా ఒప్పించారు. దీంతో పాఠశాల విద్యార్థుల సంఖ్య 104 కు చేరింది. అయితే బదిలీల పుణ్యమా అని టీచర్లు వెళ్లిపోవడం, వారి స్థానంలో కొత్తవారు రాకపోవడంతో బడి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కలెక్టర్ చొరవ చూపి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీచర్లను నియమించాలి



మా బడిలో పనిచేసిన టీచర్లందరూ బదిలీపై వెళ్లిపోయారు. ఏడు తరగతులకు ఒక్కరంటే ఒక్కరు కూడా లేకుంటే బడి ఎలా నడుస్తుంది. అధికారుల చుట్టూ తిరిగితే ఇద్దరిని సర్దుబాటు చేశారు. ఆరుగురు టీచర్లను నియమిస్తేగానీ చదువులు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు స్పందించి టీచర్లను నియమించాలి.

–బోయిని సురేశ్, రత్నగిరిపల్లి

అధికారులు పట్టించుకోలేదు



విద్యార్థులు ఉన్న బడిలో టీచర్లు లేకుంటే అంత మేర సర్దుబాటు చేయాలి. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. ఎన్నోసార్లు తిరిగితే ఇద్దరిని సర్దుబాటు చేశారు. మా ఊరి బడిని ఎంతో అభివృద్ధి చేసుకున్నం. అధికారులు టీచర్లను నియమించక విద్యార్థులు వెళ్లిపోయేలా చేస్తున్నారు. అధికారుల వైఖరి సరికాదు.

– మామింధ్ల కిషన్, రత్నగిరిపల్లి

సర్దుబాటు చేస్తున్నాం



రత్నగిరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఇద్దరు రావాల్సి ఉండగా ఒక్కరే వచ్చారు. ఆ ఒక్కరు కూడా పదోన్నతిపై వెళ్లారు. అందుకే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇద్దరిని సర్దుబాటు చేశాం. గ్రామస్తుల సహకారంతో ఒక వలంటీర్‌ను నియమించి బోధన సాగేలా చూస్తున్నాం.

– ఎల్లయ్య, మండల విద్యాశాఖ అధికారి, మాచారెడ్డి

రైతుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్న

- రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్న డిమాండ్

కామారెడ్డి రూరల్: రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్న డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని ఆరోపించారు. పంట రుణం మాఫీ కాకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో ఇచ్చిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని జీఎస్టీ నుంచి మినహాయించాలన్నారు.

వచ్చేనెల 5న రాష్ట్ర మహాసభలు

వచ్చేనెల 5న కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు అంజన్న తెలిపారు. పార్టీలకు అతీతంగా రైతుల కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉన్న పథకాలపై ఈ సభలలో చర్చిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి రైతులు భారీగా మహాసభలకు తరలిరావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎక్స్‌రే సేవలు బంద్

- నాలుగు రోజులుగా పనిచేయని మిషన్
- కాలం చెల్లిన యంత్రంతో సమస్య



ఎక్స్‌రే యంత్రం పని చేయడం లేదని ఏర్పాటు చేసిన బోర్డు

కామారెడ్డి టౌన్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి దుస్థితి. ఈనెల 8వ తేదీన ఎక్స్‌రే గదిలోని యంత్రం చెడిపోయింది. దీంతో నాలుగు రోజులుగా ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో నిత్యం 180 వరకు ఎక్స్‌రేలు తీస్తుంటారు. ఎక్స్‌రే మిషన్ పనిచేయకపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారిని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు రిఫర్ చేస్తున్నారు. టీ–హబ్ మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మెడికల్ కళాశాల ఆవరణలో ఉంది. అంతదూరం వెళ్లడానికి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సమీపంలోని ప్రైవేట్ సెంటర్లకు వెళ్తున్నారు.

12 ఏళ్ల క్రితం ఏర్పాటు

జిల్లా ఆస్పత్రిలో 12 ఏళ్ల కిత్రం ఎక్స్‌రే యంత్రాలను అమర్చారు. యంత్రాలు పాతవి కావడంతో తరచూ చెడిపోతున్నాయి. నూతన యంత్రాలను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ఆస్పత్రికి వచ్చేవారు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్‌ను వివరణ కోరగా.. 10వ తేదీన టెక్నీషియన్ వచ్చి పరిశీలించాడన్నారు. మరమ్మతులకు సంబంధించిన సామగ్రి లేకపోవడంతో ఆలస్యం జరుగుతోందన్నారు. త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూస్తామన్నారు.

మందుల కొరతపై కలెక్టర్ ఆరా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరతపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆరా తీశారు. ఆస్పత్రులలో మందుల కొరతపై 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆస్పత్రి వైద్యాధికారులతో పాటు, ఫార్మసిస్టులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మిగిలిన బడ్జెట్ రూ. 318 మాత్రమే!

కామారెడ్డి జీజీహెచ్‌లో ఏటా మందుల కొనుగోలుకు రూ. 2 కోట్ల వరకు, సర్జికల్ ఐటమ్స్‌కు రూ. 40 లక్షల వరకు బడ్జెట్ కేటాయిస్తారు. ఈ ఆస్పత్రి ఏడాది క్రితం వంద పడకలనుంచి 330 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యింది. అయినా బడ్జెట్ పెంచలేదు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశాక రోగుల తాకిడి పెరిగింది. దీంతో మందుల కోసం కేటాయించిన బడ్జెట్ ఇప్పటికే దాదాపు ఖర్చయ్యింది. ప్రస్తుతం మందుల బడ్జెట్‌లో రూ. 318 మాత్రమే మిగలడం గమనార్హం. ఆస్పత్రి స్థాయి పెరిగినందున మందుల బడ్జెట్ కూడా పెంచాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో మందుల కొరత తీర్చాలని ప్రజల కోరుతున్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి



పెద్దకొడప్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

- పత్తి రైతుల డిమాండ్
- పెద్దకొడప్‌గల్‌లో రాస్తారోకో

పెద్దకొడప్‌గల్: వర్షాలతో పంట నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకొడప్‌గల్‌లోని మహాత్మా గాంధీ చౌరస్తాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటలో నీరు నిలిచి భారీ నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ దశరథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

అటవీ అమర వీరులకు ఘన నివాళి

కామారెడ్డి క్రైం: జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. అటవీ అమర వీరులు అక్బరుద్దీన్, గంగయ్యలతో పాటు ఇటీవల గుత్తి కోయల చేతిలో హతమైన చెలిమెల శ్రీనివాస్‌రావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో నిఖిత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

రక్తదానం

అటవీ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా కామారెడ్డిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అటవీ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి నిఖిత మాట్లాడుతూ అటవీ అమరుల సేవలను గుర్తు చేసుకున్నారు. అందరు కలిసి అటవీ సంరక్షణకు కృషి చేయాలన్నారు. డివిజనల్ అధికారి రామకృష్ణ, రేంజ్ అధికారులు రమేశ్, ఓంకార్, వాసుదేవ్, అటవీ సిబ్బందితోపాటు మెడికల్ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్లు రవి, ప్రమోద్‌కుమార్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో నిఖిత

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

కామారెడ్డి క్రైం: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, భవనాలు, చెరువులు, కుంటలు, తాగునీటి వసతులకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతున్న వాటిని గుర్తించాలన్నారు. వాటి తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధులకోసం స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ ఉత్తర్వులకు లోబడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు సుజాత, శ్రీహరి, డీఈవో రాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా బియ్యం అందించాలి

జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు ఈనెలాఖరులోగా సీఎంఆర్ అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. 2023–24 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్‌పై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లుల యజమానులు కస్టం మిల్లింగ్ రైస్ సరఫరాను వేగవంతం చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలోని రైస్ మిల్లులను తనిఖీ చేస్తూ సీఎంఆర్ వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు, టాస్క్‌ఫోర్స్ డీటీలు, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు సహకరించాలి

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇంటింటి సర్వేకు తోడ్పాటు అందించాలన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 78, ఎల్లారెడ్డిలో 74, కామారెడ్డిలో 49 శాతం ఇంటింటి సర్వే పూర్తయ్యిందన్నారు. మార్పులు, చేర్పులను నిర్ణీత ఫారంలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే నెల 18 లోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారి నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలో గణేశ్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను కలెక్టర్, ఎస్పీ సింధు శర్మ పరిశీలించారు. స్టేషన్ రోడ్, గంజ్ రోడ్, పెద్ద బజార్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్, ఇందిరాగాంధీ స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపులా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని విద్యుత్, మున్సిపల్ అధికారులకు సూచించారు. పెద్ద చెరువు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పోలీసు అధికారులకు సూచించారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఎస్సైలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభం



కామారెడ్డి క్రైం: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కామారెడ్డి జిల్లా చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న చిన్న సమస్యలు, కుటుంబ తగాదాలు, భూతగాదాలు, ఆస్తి పంపకాల పరిష్కారం కోసం ఈ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సమీ ఉల్లా ఖాన్, సభ్యులు మహమ్మద్ ఖలీల్ హుల్ల, షేక్ అలీమొద్దీన్, షేక్ అబ్దుల్ లతీఫ్. విజయ్ కుమార్, నిర్మల, స్వప్న, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి



కామారెడ్డి క్రైం: గణేశ్ నిమజ్జనాన్ని మండళ్ల నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగేశ్వర్‌రావు సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ గణేశ్ మండపాల నిర్వాహకులతో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడ్వాయిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు



బీబీపేటలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..



మాగి గాయత్రి కర్మాగారంలో..

వక్రతుండ మహాకాయ..

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీధివీధినా కొలువుదీరిన గణనాథుడు భక్తులచే ఘనమైన పూజలందుకుంటున్నాడు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన గణేశ్ మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండపాల్లో పూజలందుకుంటున్న వినాయక ప్రతిమలు వివిధ ఆకృతుల్లో భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మండపాల్లో నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దేవునిపల్లి సాయి సద్గురు కాలనీలో గణనాథుడి వద్ద పూజలు



సదాశివనగర్‌లో..



ఆదిదేవ్ గణేశ్ మండపం వద్ద అన్నదానం



మద్నూర్‌లో..



గాంధారిలో పద్మశాలి సంఘం వద్ద..



బాన్సువాడలోని బీడీ వర్కర్స్ కాలనీలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



పిట్లంలో విష్ణు వినాయక మండపం వద్ద ముగ్గుల పోటీలు

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

భిక్కనూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపును బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు రోజులుగా పోలీస్‌స్టేషన్‌లో గణనాథుడికి నిష్ఠతో పూజలు చేశారు. అనంతరం బుధవారం ఎలాంటి డీజేలు లేకుండా భజనలు చేసుకుంటూ వ్యాన్‌పై గణపయ్యను ఉంచి ఊరేగించారు. దారిపొడవునా పోలీసులు భజన చేసుకుంటూ ర్యాలీగా వెళ్లడం ప్రజలను ఆకట్టుకుంది. పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలుగకుండా మట్టిగణపతిని ప్రతిష్ఠించడంతో పాటు సౌండ్ పొల్యూషన్ లేకుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సిద్ధరామేశ్వరాలయం సమీపంలో ఉన్న వినాయక నిమజ్జన చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్‌తో పాటు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



భిక్కనూరులో గణనాథుడి విగ్రహ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న పోలీసులు



గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కామారెడ్డి పోలీస్‌స్టేషన్ సిబ్బంది



ఎల్లారెడ్డిలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..



భిక్కనూరులో సిద్దార్థ విద్యాలయం ఆధ్వర్యంలో..



మన్సరాం తండాలో శోభాయాత్రలో నృత్యాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి
- బాలికల గురుకుల పాఠశాల తనిఖీ
- మళ్లీ వచ్చేటప్పటికి పరిస్థితి మారాలని ఆదేశం



గురుకులంలో భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్(జుక్కల్) : మండలంలోని పెద్ద ఎక్లారా గేట్ వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంతో స్థానిక సిబ్బందిపై సబ్ కలెక్టర్ కిరణ్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రత పాటించకపోతే విద్యార్థులు రోగాల బారిన పడతారని ఆమె పేర్కొన్నారు. మరోసారి తనిఖీకి వచ్చినప్పుడు శానిటేషన్ సక్రమంగా ఉండాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని పెద్ద ఎక్లార గేట్ వద్ద గల బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అణువణువు పరిశీలించారు. క్యాంపస్‌లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం వండిన వంటను పరిశీలించి అక్కడే భోజనం చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. క్యాంపస్‌లో భోజనం, వసతి, విద్యాబోధనపై ఆరా తీశారు. మరోసారి తనిఖీకి వస్తానని అప్పటికి పరిస్థితులు మెరుగవ్వాలని ఆదేశించారు. తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణీ, ఆర్ఐ శంకర్, జీపీ కార్యదర్శి కృష్ణవేణి ఉపాధ్యాయులు ఉన్నారు.

డోంగ్లీ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డోంగ్లీ శివారులోని ధరణిలోని వ్యవసాయ భూముల్లో పత్రాలకు సంబంధించిన సమస్యలు ఉండడంతో సబ్ కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ రేణుక చౌహాన్ ఉన్నారు.

మెట్ల బావి పనుల్లో వేగం పెంచాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి పునరుద్ధరణ పనులను బుధవారం డీఆర్‌డీవో సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బావి పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాభావంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. వర్షాలు తగ్గిన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం చేయాలన్నారు. బావి చుట్టూ సందర్శకుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసి పర్యాటకుల సందర్శన కోసం సిద్ధం చేయాలన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఈఈ గిరిధర్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో మలహరి, తదితరులు ఉన్నారు.



నాగన్నగారి మెట్ల బావి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

ప్రతిఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి



దోమకొండ : ప్రతిఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 88000 02024 కి ఫోన్ చేసి సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ఉన్నారు.

యూడైస్ యాప్‌లో ఖచ్చితమైన వివరాలుండాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఖచ్చితమైన వివరాలు యు–డైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఎంఈవో రామస్వామి సూచించారు. బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెచ్ఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎంలు తమ పాఠశాలకు చెందిన మౌళిక సదుపాయాలు, తదితర వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. డీఆర్పీ గంగాధర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ తదితరులున్నారు.

డీజేలకు అనుమతి లేదు



కామారెడ్డి రూరల్ : వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, డీజేలకు అనుమతి లేదని ఎస్సై రాజు అన్నారు. బుధవారం రాత్రి కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని మల్లన్న ఆలయం వద్ద వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు పోలీస్ కృష్ణాజీరావు, కాసర్ల గోదావరి స్వామి, ఉరుదొండ వనిత రవి, ఉరుదొండ నరేష్, వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి ఉన్నారు.

నేడు గురుకులాల్లో తక్షణ ప్రవేశాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5 నుండి 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఈ నెల 12న ధర్మారం (బి) గురుకుల పాఠశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు ధర్మారం (బి) గురుకుల పాఠశాలలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు బోనోఫైడ్ మార్కుల మెమో జతచేయాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



కామారెడ్డి రూరల్ : మండలంలోని గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఝాన్సీరాణి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎల్లయ్య, పీఈటీ నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఖోఖో పోటీల్లో పాల్గొంటుందన్నారు.

సంక్షిప్తం

పీసీసీ చీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



రామారెడ్డి : పీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో రామారెడ్డి మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, పోసానిపేట మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బాన్సువాడ రూరల్ : గణేశ్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ ముస్నూరు కృష్ణ అన్నారు. బుధవారం ఆయన బాన్సువాడ మండంలంలోని హన్మాజీపేట్ గ్రామంలో పర్యటించారు. గణేశ్ మండపాలను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నవభారత్ యూత్ మండపం వద్ద అన్నదానంలో పాల్గొన్నారు.

నేడు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సమావేశం

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మద్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వితీయ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ చాట్లావార్ గోపాల్ తెలిపారు. సంఘం నివేదిక, తదితర విషయాలు చర్చిస్తామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ సంఘం అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు ఉపాధ్యాయులు పండరిగౌడ్, గురుదాస్, అఫ్రోజ్, మౌనిక, సత్యవ్వ, జ్యోతిని ఎంపిక చేశామన్నారు. పీఆర్‌టీయూ కమిటీని ఎంఈవో నాగేశ్వర్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ సభ్యులున్నారు.

సౌత్ క్యాంపస్‌లో..



భిక్కనూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను యునివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం సన్మానించారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ యునివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం ఇదే ప్రథమం అన్నారు. తొలిసారిగా తెయూలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుధాకర్‌గౌడ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం యునివర్సిటీకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, తెలంగాణ యునివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు సాయగౌడ్, నారాయణగుప్తా ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ధర్నా



భిక్కనూరు : ఇళ్లు లేని తమకు డబుల్ బెడ్ రూంలు కేటాయించకుండా ఇతర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నావారికి.. వేరే గ్రామాల్లో ఉన్న ఇళ్లను అద్దెకు ఇచ్చిన వారికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించారంటూ భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలోని జీపీ కార్యాలయం ఆవరణలో కొందరూ బుధవారం ధర్నా చేశారు. తమకు గ్రామంతో పాటు మిగతా ఎక్కడ కూడా ఒక్క గజం కూడా ఖాళీస్థలం లేదని అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి విచారణ చేసి తమకు డబుల్ ఇళ్లు కేటాయించాలన్నారు.

యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేత



మాచారెడ్డి : మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట, ఘన్‌పూర్, రత్నగిరిపల్లి అటవీ ప్రాంతంలో కలప స్మగ్లర్లు యథేచ్ఛగా టేకు చెట్లను నరికేస్తున్నారు. కొద్ది రోజులుగా వన్య ప్రాణులను వేటాడుతూ టేకు చెట్లను నరికి అపహరించుకుపోతున్నారు. ఇటీవల అడవి పందిని చంపి తీసుకెళ్తున్న ఇద్దరు వేటగాళ్లను అటవీ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం రత్నగిరిపల్లి అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికి వేసిన 12 మంది అనుమానితులపై బీట్ అధికారిణి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై అనిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద గణేశ్ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. గణేశ్ నిమజ్జనానికి సంబంధించిన రూట్, పెద్ద చెరువు కట్ట వద్ద క్రేన్ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం తదితర పనులకు సంబంధించి వారు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, సీఐ రవీందర్‌నాయక్, నీటిపారుదల, విద్యుత్ శాఖ డీఈలు వెంకటేశ్వర్లు, విజయసారథి, ఎస్సై మహేష్, ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ గౌడ్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



గాంధారి(ఎల్లారెడ్డి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గుర్జాల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమర్లబండ దేవేందర్‌రావు అలియాస్ రాజు(35) ఉదయం తన పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. చేనుకు నీరు పారించేందుకు బోరు మోటర్ ఆన్ చేయగా అది రాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ వైరు ఊడిపోయినట్లు గమనించి దానిని కర్రతో సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ హోటల్‌పై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌పై పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ హోటల్లో వ్యభిచారం చేస్తున్న 8 విటులు, 5 గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమ్మర్‌పల్లి మండలానికి చెందిన వారు హోటల్లో లాడ్జ్ బుక్ చేసుకున్నట్లు తెలిసింది. కొన్ని రోజుల నుంచి ఈ హోటల్లో వ్యభిచారం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు పక్కా సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలుస్తోంది.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

లింగంపేట: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎక్కపల్లి తండాకు చెందిన నేనావత్ సర్దార్(35) ఆగస్టు 31న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఈ నెల 3న పోలీసులకు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. బుధవారం సూర్దకుంట వద్ద మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం సర్దార్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి శివారులో పోలీసులు బుధవారం పేకాట స్థావరంపై దాడిచేసి పది మందిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, బస్వాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నేతతో పాటు మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ఏడుగురు బడా వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. రూ.13, 760 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. కాగా పేకాట రాయుళ్లు యూపీఏ ద్వారా ఆన్‌లైన్‌లో పెద్ద మొత్తంలో నగదు చెల్లింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు.

కొత్తపల్లిలో..

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు స్థావరంపై దాడి చేయగా ముగ్గురు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ. 5520 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు, సాలూర మండల కేంద్రంలోని శివారులో ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను చోరీ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



యువకుడి అదృశ్యం

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై రంజిత్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిరుత సంచారం

నిజాంసాగర్: మండలంలోని గోర్గల్ అటవీ ప్రాంతంపై బుధవారం సాయంత్రం చిరుత వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. చెర్వు ముందరి తండా శివారులోని నీలగిరి ప్లాంటేషన్ నుంచి గోర్గల్ గ్రామ ప్లాంటేషన్ వైపు చిరుత రోడ్డు దాటి వెళ్లిందన్నారు. చిరుత సంచారంతో ఆయా ప్రాంతాల్లో పంటపొలాల కాపాలాకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు కోరారు.

మద్యం మత్తులో తల్వార్‌తో దాడి

బాన్సువాడ/బాన్సువాడరూరల్: పట్టణంలోని మధురాలయ బార్ వద్ద బుధవారం రాత్రి ఓ యువకుడు తల్వార్‌తో దాడి చేసిన ఘటన కలకలం సృష్టించింది. సంజీవ్ అనే ఆటోడ్రైవర్ తన మిత్రుడు పల్లికొండ కృష్ణతో కలిసి బార్‌లో మద్యం తాగుతున్న సమయంలో సోనూసింగ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న వీరి మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. సోనూసింగ్ ఇంటికి వెళ్లి తల్వార్ తీసుకొచ్చి సంజీవ్‌పై దాడికి పాల్పడ్డాడు. దాడిలో సంజీవ్‌కు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని సంజీవ్‌ను వైద్యం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంజీవ్ తమ్ముడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14, 17 విభాగంలో బాలబాలికలకు కరాటే పోటీలను కామారెడ్డి జిల్లా దోమకొండలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి నాగమణి బుధవారం పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.